క్లుప్తంగా

ఉత్కల్ సమాజ్ నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: నగరంలో ఒడియా కమ్యూనిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన సామాజిక-సాంస్కృతిక సంస్థ ఉత్కల్ సాంస్కృతిక సమాజం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సిరిపురంలోని సమాజ్ ప్రాంగణంలో ఆదివారం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడిగా జేకే నాయక్, ఉపాధ్యక్షులుగా సోమనాథ్ సాహు, డాక్టర్ కరుణాకర్ పాడి, కార్యదర్శిగా సీమా మొహంతి, కోశాధికారిగా మహేశ్వర్ బెహెరాను ఎన్నుకున్నారు.

పక్షులకు అందుబాటులో తాగునీరు ఉంచండి



ధాన్యం కంకులు, మట్టి పాత్రలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పక్షులకు తాగునీరు ఇళ్ల వద్ద అందుబాటులో ఉంచాలని విద్యార్థులు అవగాహన కల్పించారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని ఉషోదయ కూడలిలో ఈ కార్యక్రమం జరిగింది. పక్షులకు ఆహారంగా అందించే ధాన్యం కంకులు, తాగునీటి మట్టి పాత్రలను వీధుల్లో నివాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలనే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండు వేసవిలో నీరు, ఆహారం కోసం పశుపక్ష్యాదులు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయన్నారు. వాటిని సంరక్షించడంలో నగర ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, జి.నాగమురళి, ఉపాధ్యాయుడు పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



లైఫ్ గార్డ్స్‌తో మాట్లాడుతున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తీర ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్, సెక్యూరిటీ గార్డ్స్ అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. రుషికొండ బీచ్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. తీరం వెంబడి అనుమానిత వ్యక్తులు కనిపించినా.. అనుమానంగా బోట్లు పయనించినా తమకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. రుషికొండ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారని.. జాగరూకతతో వ్యవహరించాలన్నారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఘనంగా నృసింహ జయంతి



లక్ష్మీనృసింహ స్వామికి పంచామృతాభిషేకం

సీతంపేట: నృసింహ జయంతి సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెం లలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్‌లో ధన్వంతరి సహిత శ్రీసుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతమ్మధార కృష్ణ మందిరంలో..

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని కృష్ణ మందిరంలో వేదపండితులు నృసింహ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రపంచ శాంతి అని నిర్వాహకులు తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించన భక్తదాస నరసింహ అవతారం గురించి భక్తులకు వివరించారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు నరసింహ యజ్ఞం, అనంతరం పూర్ణాహుతి, శాంతి వచనం, నరసింహ లీలావచనం, మంగళహారతి, సంకీర్తన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

ఈ వార్డుపైనే కక్ష ఎందుకు..?



22వ వార్డులోని దుకాణాలను తొలగించి తరలిస్తున్న జీవీఎంసీ అధికారులు(ఫైల్)

- 22వ వార్డులోనే తొలగింపులు
- మిగిలిన వార్డుల్లో కానరాని చర్యలు
- జీవీఎంసీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- నిత్యం నరకం చూస్తున్న వార్డు ప్రజలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ పరిధిలో 98 వార్డులున్నా.. అధికారుల దృష్టంతా ఆ ఒక్క వార్డు మీదే ఉంటుంది. అక్కడ నివసిస్తున్న పేదలు, స్థానికులు వారికి కనిపించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు మాత్రమే కనిపిస్తాయి. నగరంలో ఎక్కడా లేని నిబంధనలు ఈ వార్డులో మాత్రమే అమలవుతాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి శాశ్వత దుకాణాలు పెట్టుకున్న తొలగించని జీవీఎంసీ అధికారులు.. ఈ వార్డులో మాత్రం తాత్కాలిక దుకాణాలను వెంటనే తొలగించేస్తారు. పార్కులను ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకుంటే కన్నెత్తి చూడని అధికారులు.. ఈ వార్డులో మాత్రం పిల్లల ఆట వస్తువులను కూడా తీసి పడేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమపై ఒత్తిడి ఉందని, అందుకే తొలగిస్తున్నామని బదులిస్తున్నారు. ఇప్పుడు చెప్పుకున్నదంతా జీవీఎంసీ 22వ వార్డు గురించే.. ఇక్కడి ప్రజలు నిరంతరం నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడు ఏ చర్యలు తీసుకుంటారోనని భయం భయంగా జీవిస్తున్నారు.

ఆ అక్రమ నిర్మాణాలు కనిపించవా..

బడా బాబులూ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. జీవీఎంసీ అధికారులకు కనిపించవు. పేద రజక కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు రక్షణ గోడ నిర్మించుకుంటే మాత్రం బుల్డోజర్ వేసుకొని వచ్చేస్తారు. పీతాపురం కాలనీలోని వాంబే ఇళ్లకు నిర్మించుకున్న భద్రత గోడను అక్రమ నిర్మాణమంటూ వారం రోజుల కిందట అధికారులు కూల్చేశారు. అదే వార్డు మంగాపురం కాలనీలో జీ ప్లస్ 2కు అనుమతులు పొంది.. జీ ప్లస్ 3 భవనం నిర్మించుకుంటే మాత్రం అధికారులు అటు వైపు చూడలేదు. గెడ్డను ఆక్రమించి భవన నిర్మాణం కొనసాగిస్తున్నా.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పేదలపై మాత్రం పక్షపాత ధోరణి ఎందుకంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్క్‌లో నిర్మాణాల తొలగింపు

పిల్లలకు ఆనందం.. పెద్దలకు ఆహ్లాదం పంచేందుకు నిర్మించిన పార్క్‌లపై అధికారుల తీరు బాగోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కాలనీ అసోసియేషన్ల భాగస్వామ్యంతో నిర్మించిన పార్కుల్లో స్థానికుల కోసం కొన్ని నిర్మాణాలు చేపట్టడం సహజం. ఇలా నగరంలోని అన్ని అసోసియేషన్లు చేస్తుంటాయి. ఈ వార్డులోని పీతాపురం కాలనీ అసోసియేషన్ చేసింది మాత్రం అక్రమమంటూ కాలనీ పార్క్‌లోని నిర్మాణాలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. మూడు రోజుల కిందట పీతాపురం కాలనీ పార్క్‌లోని ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలను తొలగించిన అధికారులు పార్క్‌లో వేదికను కూల్చేందుకు ప్రయత్నించారు. స్థానికులు నిరసన వ్యక్తం చేయటంతో వెనక్కి తగ్గారు.

మొట్టికాయలు వేస్తున్న కోర్టులు

ఈ వార్డులో కొన్ని నెలల కిందట తొలగించిన దుకాణాల విషయంలో చిరు వ్యాపారాలు కోర్టును ఆశ్రయించారు. నిబంధనల ప్రకారం ఫుట్‌పాత్‌లను ఆక్రమించి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకోకూడదని, తాత్కాలిక దుకాణాలను తొలగించడంపై జీవీఎంసీ అధికారులను తీరును కోర్టు మందలించి.. మొబైల్ షాపుల ఏర్పాటుకు అనుమతులను జారీ చేసింది. పార్క్ విషయంలోనూ పీతాపురం కాలనీ అసోసియేషన్ హైకోర్టుకు వెళ్లడంతో శనివారం పార్కులోని నిర్మాణాలను తొలగించటంపై హైకోర్టు స్టేటస్ కోను జారీ చేసింది.

జోనల్ అధికారులూ.. ఇది తగునా!

జీవీఎంసీ జోన్–3 పరిధిలోని వార్డుల్లోనే అధికారులు విభిన్నంగా నిబంధనలు అమలు చేస్తున్నారు. జోన్–3 టౌన్ ప్లానింగ్ డీసీపీ, టీపీఎస్‌లు 22వ వార్డులో అమలు చేసే నిబంధనలు.. అదే జోన్‌లోని 20వ వార్డులో మాత్రం కనిపించవు. ఆ వార్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, పార్కులో నిర్మాణాలు చేపట్టినా వర్తించని నిబంధనలు 22వ వార్డులో వర్తింప చేస్తున్నారు. జోనల్ అధికారుల తీరుపై ఇదేం న్యాయమంటూ 22వ వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అన్ని చోట్ల ఒకేలా నిబంధనలు వర్తింపజేయాలని, తమను ఇబ్బందులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత దుకాణాల జోలికెళ్లని అధికారులు

జీవీఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా కొందరు వ్యాపారాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆక్రమణలు ఎక్కువయ్యాయి. ఫుట్‌పాత్‌లపై శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు పెట్టుకుంటున్నా.. అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడారు. 22వ వార్డులో 30 ఏళ్లగా చిన్న చిన్న దుకాణాలు తాత్కాలికంగా పెట్టుకొని వ్యాపారం చేస్తే మాత్రం జీవీఎంసీ అధికారులకు నిబంధనలు గుర్తొస్తాయి. వాటిని వెంటనే తొలగిస్తారు. 2 నెలల కిందట 22వ వార్డులో సుమారు 200 దుకాణాలను అధికారులు ఎటువంటి ముందుస్తు సమాచారం లేకుండా తొలగించారు. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అదే రోజు 22వ వార్డును ఆనుకుని ఉన్న 17వ వార్డులోని దుకాణాలను తొలగించేందుకు సిబ్బంది వెళ్తుంటే జీవీఎంసీ అధికారులు తొలగించవద్దని ఆదేశాలు జారీ చేశారు.



20వ వార్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన శాశ్వత దుకాణాలు



పీతాపురం కాలనీ వాంబే గృహాల వద్ద రక్షణ గోడను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న అధికారులు (ఫైల్)



పీతాపురం కాలనీ పార్క్‌లో తొలగించిన జిమ్, ఆట పరికరాలు



20వ వార్డు జీవీఎంసీ లెండి వనంలో నిర్మించిన భవనం

పీతాపురం కాలనీ పార్క్‌ను అసోసియేషన్‌కు అప్పగించాలి

బీచ్‌రోడ్డు: పీతాపురం కాలనీలో పార్క్‌గా కేటాయించిన భూమిపై కమర్షియల్ భవన నిర్మాణం కోసం జీవీఎంసీ చేపట్టిన ఆక్రమణ చర్యను విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ ప్రతినిధులు పీతాపురం కాలనీ పార్క్‌ను అసోసియేషన్‌కు అప్పగించాలని కోరుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్క్ 1990కి ముందు స్థితికి భూమిని తిరిగి పునరుద్ధరించి, ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపేయాలని అధికారులను డిమాండ్ చేశారు. నగరాభివృద్ధి నియమాల ప్రకారం.. నివాసుల వినోద కార్యకలాపాల కోసం ఓపెన్ స్పేస్‌లను కేటాయించారని, రెసిడెంట్స్ అసోసియేషన్ వెల్ఫేర్ ఏర్పాటయ్యాక వాటి నిర్వహణ కోసం అసోసియేషన్లకు అప్పగించారని గుర్తుచేశారు. 1990లో జీవీఎంసీ ఇక్కడి భూమిలో అక్రమంగా ఓ భాగాన్ని స్వాధీనం చేసుకుని కమర్షియల్ బిల్డింగ్ నిర్మించిందని, ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో మిగిలిన పార్కులో కొంత ప్రాంతాన్ని మరో కమర్షియల్ ప్రాజెక్ట్ కోసం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇది కాలనీ వాసులకు హక్కుగా ఉన్న ఓపెన్ స్పేస్‌ను దుర్వినియోగం చేయడమేనన్నారు. పీతాపురం కాలనీ ప్రజలకు, పరిసర ప్రాంతాల వారికి వినోదం, నడక మార్గాలు, ఓపెన్ జిమ్, సంఘ సమావేశాలకు ఈ పార్కు కీలకంగా ఉపయోగపడుతోందని చెప్పారు. గ్రీన్ స్పేస్‌ల స్థానంలో కమర్షియల్ భవనాలు నిర్మించడం నగర ప్రణాళిక ప్రమాణాలకు విరుద్ధంగా ఉండి, ప్రజల సంక్షేమాన్ని ధిక్కరిస్తోందని పేర్కొన్నారు. పూర్తిగా పార్క్‌గా అభివృద్ధి చేసి, నడక మార్గాలు, పచ్చదనం, వినోద సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు పారదర్శకత ఉండాలని, పబ్లిక్ స్పేస్‌లను కమర్షియల్ ప్రయోజనాల కోసం ధ్వంసం చేయడాన్ని సమాజం సహించదని పేర్కొన్నారు.

అడుగడుగునా ఆహార వ్యర్థాలు

- బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై దర్శనం
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు, వాకర్స్



బీచ్ రోడ్డు, ఫుట్‌పాత్‌పై పడి ఉన్న ఆహార వ్యర్థాలు, కవర్లు

ఏయూక్యాంపస్: సాగర తీరం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం వేళలో వందలాది మంది తీరంలో గడపడానికి వస్తుంటారు. నగరవాసులతో పాటు పర్యాటకులు సైతం ఉదయం వేళల్లో సూర్యోదయాన్ని వీక్షిస్తూ తీరంలో ఇసుక తిన్నెలపై సమయం గడపడానికి ఆసక్తి చూపుతారు. నగరానికే తలమానికంగా విశాఖ సాగర తీరం నిలుస్తుంది. అటువంటి పర్యాటక ప్రదేశంలో పారిశుధ్య నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఉదయం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేయడానికి బీచ్ రోడ్డుకు వచ్చే నగరవాసులకు పారిశుధ్య సమస్యలు పరీక్ష పెడుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, రహదారుపైన వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం వేళల్లో పర్యాటకులు తిని పడేసిన కప్పులు, కవర్లు, ఆహార పదార్థాలు బీచ్ రోడ్డులో అడుగడుగునా కనిపిస్తున్నాయి. డస్ట్ బిన్లలో వేసిన వీటిని ఆవులు, కుక్కలు, పక్షులు రోడ్లపైకి తీసి పడేస్తున్నాయి. రాత్రి వేళల్లో డస్ట్ బిన్లు శుభ్రం చేస్తే ఇటువంటి సమస్య ఎదురవదు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో పారిశుధ్య పనులను చేపటితే సాగర తీరం మరింత పరిశుభ్రంగా నగరవాసులకు మరింత ఆహ్లాదాన్ని పంచే అవకాశం ఉంటుంది. ఈ దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.



ఆహార వ్యర్థాలతో అధ్వానంగా ఫుట్‌పాత్

ప్రమాదకరంగా గెడ్డ అంచు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం వద్ద గెడ్డ అంచు ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీఫారం కూడలి నుంచి ఇందిరా నగర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన గెడ్డ భాగం శిథిలమైంది. దీని అంచు లోపలకు కూలిపోయింది. దీంతో రోడ్డుపై నుంచి ఇది లోయలా మారింది. ఇరుకు రోడ్డు కావడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వెళ్తేన్న వాహనాలు ఒక్కోసారి అదుపు తప్పి గెడ్డలోకి దూసుకుపోతున్నాయి. రాత్రి వేళ ఎక్కువగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న సమయంలో వాహనాల లైట్లు వాహన చోదకుల కళ్లకు తగిలి శిథిలమైన రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి డెయిరీఫారం పెట్రోల్ బంక్ నుంచి ఇందిరానగర్ ఆర్చి వరకు రోడ్డు అంచున రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.



పాత డెయిరీఫారం పెట్రోల్ బంక్ వద్ద కోతకు గురైన గెడ్డ

ప్రత్యక్ష దైవం అమ్మ



మహిళలను సత్కరిస్తున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం లగుడు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు లగుడు గోవిందరావు నగరంలోని వృద్ధాశ్రమంలో మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ దినోత్సవం రోజున ప్రతి తల్లిని గౌరవించడం ఎంతో అవసరమన్నారు. మనకు ప్రత్యక్ష దైవంగా మాతృమూర్తి నిలుస్తుందన్నారు. వృద్ధాశ్రమంలోని మహిళలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పెదిరెడ్ల సత్యం, పి.శ్రీనివాస్, వెంకటేష్, అబ్రహం సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక రామాలయం వీధిలో టీడీపీ నాయకులు ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడి పుట్టినరోజు సందర్భంగా రామాలయంలో పూజలు చేసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు వేజెల్ల సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, అక్కరమాని రాంబాబు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

14న ఖాళీ దుకాణాలకు వేలం

అల్లిపురం: కేజీహెచ్ డౌన్‌లో ఉన్న రక్షా కాంప్లెక్స్ షాపు నంబర్ 13 (గ్రౌండ్ ఫ్లోర్), షాపు నంబర్ 24 (ఫస్ట్ ఫ్లోర్), షాప్ నంబర్ 32 (ఫస్ట్ ఫ్లోర్)లను లీజుకిచ్చే నిమిత్తం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు అడ్వాన్స్ చెల్లించాలన్నారు. ప్రతి ఏటా 10 శాతం అద్దె పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 14న ఉదయం 11 గంటలకు పోలీస్ బ్యారెక్స్ (సిటీ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ కాంప్లెక్స్)లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 94409 04710, 99488 42851 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆచార్యులతో పూర్వ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఐఏఎస్ఈ కాలేజీలో 2001–2002 బ్యాచ్ బీఈడీ శిక్షణ పొందిన విద్యార్థులు ఆదివారం క్యాంపస్ కాలేజీలో సమావేశమయ్యారు. నాడు చదువుకున్న కాలేజీలోని తరగతి గదుల్లో కూర్చొని, నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు చదువులు చెప్పిన ఆచార్యులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. క్యాంపస్ కాలేజీలో చదువుకొని, వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడిన వారంతా భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రిన్సిపాల్ నాగరాజకుమారి, ఆచార్యులు శ్రీదేవి, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరం.. ఉదయ రాగం



సాగర తీరంలోని ఇసుకలో వ్యాయామం చేస్తున్న యువత

- బీచ్ రోడ్డులో నగరవాసుల సందడి
- సూర్యోదయానికి ముందు నుంచే వ్యాయామాలు

ఏయూక్యాంపస్: సాగర తీరం ఉదయ రాగాన్ని ఆలపిస్తోంది. కోడి కుయ్యక ముందే సముద్ర తీరంలో జన సందడి కనిపిస్తోంది. ఉషోదయం కంటే ముందుగానే నగరవాసులు సాగర తీరానికి చేరుకుంటున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కూడా ఉండటంతో చిన్నారులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి వచ్చి వ్యాయామం చేయడంపై ఆసక్తి చూపుతున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు నిత్యం తమకు నచ్చిన వ్యాయామాన్ని సాధన చేయడంలో నిమగ్నమైపోతున్నారు. చెమట చిందించడానికి, శరీరంలో ప్రతీ అవయవాన్ని ఉత్తేజం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం ఉదయం సాగర తీరంలో ఈ దృశ్యాలు కనిపించాయి. నేవీ మారథాన్‌కు సన్నాహకంగా నిర్వహించే ప్రేరణ నడకను సైతం కాళీమాత ఆలయం నుంచి ప్రారంభించారు. దీనిలో పలువురు నావికాదళ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పది కిలోమీటర్ల పరుగు పోటీలో పలువురు ఉత్సాహంగా పాల్గొని పూర్తిచేశారు. ఆదివారం కావడంతో పలువురు సైకిల్‌పై, స్కేటింగ్ చేస్తూ సాగర తీరంలో రోడ్లపై పరుగులు తీశారు. మరికొంత మంది వాకింగ్, రన్నింగ్ చేస్తూ శరీరానికి కాస్త పనిచెప్పారు. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ దీనిని నిత్యం కొనసాగిస్తే అనారోగ్యం దరిచేరదు. అథ్లెట్లు, క్రీడాకారులు సైతం ఇసుక తిన్నెలపై సాధన చేస్తూ స్ఫూర్తిని నింపుతున్నారు. మొత్తం మీద సాగర తీరం సాధన తీరంగా నిలుస్తోంది.



వాకింగ్ చేస్తున్న చిన్నారి



సైక్లింగ్ చేస్తున్న నగరవాసులు



బీచ్ రోడ్డులో యువకుడి స్కేటింగ్